# 'ఈ రాధేనా?'

యల్లాప్రగడ సీతాకుమారి

సాయంకాలం అయ్యేటప్పటికి రెసిడెన్సీచమను, గాలి మేతకు వచ్చినయువకులతోటీ, ఆటలకు వచ్చిన పిల్లలతోటీ కిటకిటలాడిపోతుంటుంది.

అందులో ముందువైపు స్క్వేరులో రాజారావు కూచొని, అఖిలాంధ్రకథక సమ్మేళనానికి పంపడానికి ఏమికథ రాద్దామా అని ఆలోచనచేస్తున్నాడు: "కథకు ఎన్నివిధాల చూచినా మంచి 'థీము' దొరకడములేదు. అందులో టూకీగా రాశామాఅంటే పాఠకులు సందర్భాలు వివరంగాలేవు అంటారు. పోనీ వివరంగారాస్తే చాలా దీర్ఘంఅయింది మా కక్కర్లే దంటారు సంపాదకులు. పైగా చిన్నకథకు పాతవిషయా లేమీ పనికి రావు, కొత్తపోకడలు ఏం పోదాము? ప్రణయరంగా లేమన్నా తీసుకుందామా? అబ్బే, ప్రణయమంతా పాత పడిపోయింది. పోనీ కర్షకకార్మికసమస్యలో?— చెత్త. ఎందుకూ మనకర్షక కార్మికులేమో రష్యాలోలాగ చదువుకోరు. ఇతర్లు చదివినా కార్యం శూన్యం. ఏదో కాస్త చదువుకున్న ఆడవాళ్లను తీసుకొని అవీ ఇవీ తగిలించిరాస్తే... బాగానేఉంటుంది కాని ఇప్పటిస్త్రీలు ఊరుకోడంలేదు. మా తెలుగువాళ్ల డాబులూ, ఇంట్లో కోతలూ, బయట పిరికితనమూ...ఉహూఁ. ఈ కుళ్లంతా పేపర్లకెక్కిస్తే బయటివాళ్లు ఎగతాళిపట్టించరూ!! పోనీ మా యువకుల్లో......"

ఆకస్మికంగా ఆతని ఆలోచనలకి అంతరాయం కలిగింది. ఎదురుగా ఒక పదహారేళ్లఅమ్మాయి పమిట చెంగుతో కన్నీళ్లు తుడుచుకుంటూ నిలుచొని ఉంది. ఆమె చూడ్డానికి ఎక్కువసౌందర్యవతి కాదు. చామన చాయా, సామాన్యమైన పొడుగూ, పల్చనిచెంపలూ, కొద్దిగా ముందుకు వాలిననుదురూ చూడ్డానికి చాలా సామాన్యంగా కనిపిస్తుంది. కాని ఆకళ్లూ ఆజుట్టూ...అవి రెండే ఆ అమ్మాయిని మనిషిని చెయ్యడానికి తోడ్పడ్డాయి. ఆ కళ్లుగూడా చాలా పెద్దవి కావు కాని నల్లగానూ, తీక్ష్ణంగానూ ఉండి ఒకవిధమైన వశీకరణ శక్తితో ప్రకాశిస్తూఉన్నాయి. జుట్టుకూడా బిరుసుగానూ, వంకరలుగానూ ఉండి, ఆమెలోని ధృడనిశ్చయాన్ని తెలియజేస్తున్నాయి.

రాజా ఆ అమ్మాయిని ముందుగా పలకరించడం ఎందుకని ఊరుకున్నాడు, కాని ఆమె మరికొంచెం సమీపానికి వచ్చి "క్షమించాలి, మీ పరిచయము లేకపోయినప్పటికీ, మీ వేషాన్నిబట్టి ఆంధ్రులేనని గ్రహించి మాట్లాడుతున్నాను. ప్రస్తుతము నేను కొంచెం ఇబ్బందిలో ఉన్నాను. ఇప్పు డెవరయినా ఒక పురుషుడిసాయం కావలసివుంది. కనుక మీరేమయినా నాకు సాయం చెయ్యగలిగితే..." సగంలోనే అందుకొని రాజా "తప్పకుండా నా ప్రాణాల్నిచ్చైనా రక్షిస్తాను. మీకు వచ్చిన ఆపద ఏమిటో చెప్పండి. ఆంధ్రులకు ఆంధ్రులు కాకపోతే మరెవరు తోడ్పడుతారు?" అంటూ పొంగిపొయ్యే ఆంధ్రోత్సాహంతో తొందర పెట్టాడు.

"కృతజ్ఞురాలిని, నా స్థితి అంతా ఇప్పుడు చెప్పాలంటే చాలాకాలం పడుతుంది. టూకీగా చెబుతాను. మావాళ్లు నన్ను ఇప్పుడొకపల్లెటూరిముసలివాడికిచ్చి పెళ్లిచెయ్యాలని చూస్తున్నారు. నాకది ఇష్టంలేక, ప్రస్తుత మాముహూర్తం తప్పించాలని వీలయినంతవరకు ఒక వందరూపాయలవరకూ దొరికించుకొని ఇలా వచ్చాను. మీరు దయవుంచి నన్ను ఒక సురక్షిత స్థానంలో జేరిస్తే కొన్నాళ్లుండి మళ్లీవస్తాను...ఏమంటారు?"

"మీ ధైర్యానికి నా అభినందనాలు. ఇలాంటి అసందర్భపు బలాత్కారవివాహాలను బలవంతంగా ఫోర్సుచేసి అయినా తప్పించాలని మా యువకుల ఉద్దేశం తప్పకుండా మీరు కోరినచోట మిమ్మల్ని దిగబెట్టివస్తాను."

ఆ అమ్మాయి సంతృప్తనయనాలతో 'అలాగైతే మనం పాదునగరం వెళుదాము. ఈ రోజుల్లో అక్కడ కొంచెం చల్లగాకూడా ఉంటుందిట...' అంటూ వీథిలోపోతున్న ఒకమనిషిని చూచి కొంచెం భయంతో ముఖం పక్కకు తిప్పుకొని "చూచారా, ఆ ఎర్రకోటు మనిషి మాపక్క ఇంట్లోనే ఉంటాడు. మనల్ని చూచి

నట్లు మావాళ్లతో చెప్పాడాఅంటే మళ్లీ ప్రమాదంలో ఇరుక్కుపోతాము. సాధ్యమైనంత త్వరగా మనం వెళ్లిపోతే మంచిది" అంది.

రాజాకూడా కొంచెం తడబడి, "మీరు ఇక్కడే చెట్లచాటున కొంచెం నిలబడండి. నేను వెళ్లి టాక్సీని తెస్తాను" అని గబగబా ప్లాటుఫారంకుదగ్గిరకు వెళ్లి ఐదు నిముషాల్లో ఒకకారు తీసుకువచ్చాడు. ఇద్దరూ కట్టుబట్టలతో అందులో ఎక్కికూచోని కాచీగూడెం స్టేషనుకు పోనిమ్మన్నారు.

"ఇక్కడనుంచీ సౌకర్యంగా ఉండడానికి మీపేరేమిటో చెప్పండి, నన్ను రాజారావు అంటారు" అన్నాడు రాజా.

ఆమె కొంచెం నెమ్మదిస్తున్న తొట్రుపాటుతో "రాధ అంటారు" అంది.

రైలు కదిలింతరువాత ఇద్దరూ సంభాషణలోకి దిగారు. "ఐతే మీవాళ్లు ఎందు కిస్తున్నారు అంతపెద్దవాడికి?"

"ఏమీ లేదు, ఎక్కడ చూచినా పెద్దపెద్ద కట్నాలు కావలెననేవాళ్లే, పోనీ కాలేజీస్టూడెంట్లెవరన్నా కట్నం లేకుండా వప్పుకుంటారేమోనంటే, వాళ్లరేటు మరీ ఎక్కువగా ఉంది అభివృద్ధిపక్షంలో యువకు లెవరన్నా కుదురుతారేమోనంటే వాళ్లకి నా చదువూ, చక్కదనమూ సరిపోలేదు. ఏంచేస్తారు మరి."

"ఐతే మరి నీవు పారిపోయిమాత్రం ఏంలాభం"?

"ఏదో తొందరపడకుండా విచారిస్తే, ఎవరైనా సంస్కారబుద్ధి ఉన్నవాళ్లు దొరక్కపోతారాఅని... మీ రేంచేస్తున్నా రిప్పుడు ?"

"ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాను. ఈయేడే ఎమ్, ఏ, అయిపోయింది. మానాన్నగా రెక్కడన్నా ఉద్యోగంలో ప్రవేశించమంటున్నారు. నాకేమో జర్మనీ వెళ్లి డాక్టరేటు తెచ్చుకుందామని ఉందికాని ఏదో ఆర్థికపువిక్కుల్తో అనుకూలపడ్డం లేదు."

"బహుశా వివాహం అయిం దనుకుంటాను."

"ఇంకా లేదండీ, అదంతా ఓ రామాయణం. అసలు నాకు పెళ్లంటేనే ముందు అదోవికారం. అందులో నా ఉద్దేశాలకు తగిన ఆమె దొరకడం అంటే, కుందేటికొమ్ము సాధించడ మన్నమాట!"

"అలాగా, అయినా ఎలాటిఊహ లుండేవో...?

"అసలు నాకు మన తెలుగుపిల్లలంటేనే అసంతృప్తి; ఎక్కడైనా మగాడిమాట వినబడితే తుర్రున పారిపోవడమూ, ఏ సందర్భంలోనన్నా కాస్సేపు నలుగురు మగవాళ్లల్లో నుంచోవలిసివస్తే ఇక తొట్రుపాటు, పమిటెసర్దడమూ, బెదురుచూపులూ ఇలాటి వాళ్లతో మన కేంగొమాన్ను దొరుకుతుంది? ఏదో సందర్భపడితే జర్మనీనుంచే..."

"పోనీ, మంచిచదువులు చదివినవాళ్లెవరూ దొరకలేదూ ఇక్కడే?...

"ఇక్కడ ఒకటుంటే ఒకటుండదండీ. చదువుంటే చక్కదనం ఉండదూ, రెండూ ఉంటే చలాకీగా ఉండదు. హైద్రాబాదులోనే ఎన్నో సంబంధాలున్నాయి. నా కొక్కటీ నచ్చలేదు. మా మేనమామ కూతురే ఓ అమ్మాయి ఉంది. చిన్నప్పు డొకసారి చూచాను 'తోకఒకటి తక్కువగా' ఉంటుంది. మా వాళ్లంతా చేసుకోమన్నారు. కాని నేను ఒద్దుపొమ్మన్నాను. నాసంగతి విన్నారుకాదూ, ఏదో కాస్త ఆంధ్రోద్యమంఅనీ, వైతాళికసమితిఅనీ, సమ్మేళనాలనీ,...ఏదో ఒకఉద్యమం నడిపిస్తూ ఉండాలిసిందే కాని ఊరికేఉండే ఘటం కాదు. ఇక తీరా చేసుకున్న తరువాత అవతలి మనిషికూడా కాస్త మనకు సరిపొయ్యేటట్లుండాలెనా...!"

ఏదోస్టేషనులో బం డాగింది ఎవరో తెలుగు వాళ్లే మొగుడూ పెళ్లామూ పిల్లల్తో వచ్చి ఎక్కారు. రాజా కొంచెం సర్దుకుంటున్నాడు. రాధమాత్రం బెరుకులేకుండానే ఆవచ్చినవాళ్ల నడిగి ఒక చెంబు పుచ్చుకొని 'మాడండీ అక్కడ నల్లా ఉంది, మీరు కొంచెం తాగి నాకొంచెం తెచ్చిపెడుతారూ... ?" అంది.

రాజా నీళ్లు తీసుకువచ్చాడు. ఇంతలో రాధ అక్కడికి వచ్చిన పూరీ, నేరూ కొనిఉంచింది. ఇద్దరూ ఫలహారం మొదలెట్టారు.

రాజాతల్లో ఆలోచనశకటాలు పరుగెత్తుతున్నాయి, "పాపం ఎప్పుడు తిన్నదో, ఏమో...? ఐనా ముఖంలో ఇందాకటిదైన్యం కొంచెం తగ్గింది. ఇప్పుడు మనిషిలో కొ్స్తం చురుకుదనంకూడా కనిపిస్తున్నది, ...నేను కొత్తవాణ్ణే అయినా ఎవరికీ అనుమానం కలక్కుండాఉండడానికేమో, ఎంతో చనువుగా ఉంటున్నది ...? ఈమె మోస్తరు"

పాడునగరంలో దిగి ఇద్దరూ బండిచేసుకొని వెళ్లి ఒక ఇంట్లో దిగి కావలసినసామాన్లన్నీ కొద్దికొద్దిగా తెచ్చుకున్నారు.

మర్నాడుసాయంత్రం రాజా ప్రయాణం అయినాడు. కాని రాధ విచారంతో వేడుకుంది. "ఈకొత్తవూళ్లో నేనొక్కదాన్ని ...ఇంకో రెండురోజులుంటే ...ఎల్లుండే మావాళ్లు పెట్టినముహూర్తం ...అదయిపోతే మళ్లీ మనం ఇంటికి వెళ్లిపోవచ్చును."

నిజంగా రాజాకూడా వెళ్లలేకపోయినాడు. ఆరాత్రి రాజాహృదయంలో చిన్నకదలిక కలిగింది. రాధ నడత అతన్ని చాలా ఆకర్షించేస్తున్నది. ఆమెమాటల్లోనూ, నడతలోనూ, ఎక్కువఅనురాగమూ, పరిపూర్ణమైనజాగ్రతా, సూక్ష్మమైన విధేయతా, తొలుకాడుతూ కనిపించేవి. ఆమెఅంటే అతనికీ ఒకవిధమైన అవ్యక్తభావం ఎక్కువౌతూ ఉన్నది. పాపం. కష్టాల్లో ఉందికాదూ, సానుభూతేమో...ఏమో...త్వరగా వెళ్లిపోతే బాగుండును.

నిద్ర లేచేటప్పటికి రాధ ఫలహారమూ, కాఫీ తయారుచేసింది. చిన్నవయసేకాని చాలా రుచిగా ఉన్నాయి. రాజా కొద్దికొద్దిగా సంకోచం వదిలిపెట్టి, అడిగి వేయించుకోడం మొదలుపెట్టాడు.

"పాపం నానుంచి మీకు చాలా కష్టం కలిగింది, అక్కడేమన్నా తొందరపనులున్నాయో ఏమో" అంది రాధ కాఫీ కలుపుతూ.

"అంత చెడిపొయ్యేపనులేమీ లేవులెండి. వచ్చే శుక్రవారంనాడు కథకసమ్మేళనం ఉంది. దాని కందుకుంటే సరి. కష్టంమాత్రం ఏముందీ నాకు. నాలుగుఉపన్యాసా లిచ్చేకంటే, ఒక అబలను కష్టాల్లోనుంచి తప్పిస్తే మంచిదికాదా ?"

గంభీరమయిన రాధముఖంలోనుంచి ఒక నిశ్వాసంతో కూడుకున్న మందహాసం బయటికొచ్చింది. "నిజంగా ఆ కష్టసమయంలో మీరు దొరికినందుకూ... మీలో ఇన్ని ఆదర్శోద్దేశాలు ఉన్నందుకు ...ఆ భగవంతుడికి పదివేలనమస్కారాలు."

"అబ్బే, అట్టేపొగడకండి నాకు కష్టంగా ఉంటుంది. ఎలాగైనా మిమ్మల్ని నిర్విచారంగా ఇంటికి చేరిస్తే......"

రాధ సంతృప్తహృదయంతో వంటకు వెళ్లిపోయింది.

సాయంకాలం రాజా అక్కడక్కడ తిరిగి ఇంటికి వచ్చేసరికి రాధ తలంటిపోసుకొని క్రిందటిరోజే తెప్పించిన ఔరంగాబాదు తెల్లపట్టుచీర కట్టుకొని ఉతికి ఆరవేసిన పెద్దపోలోకాలరుజంపరు వేసుకొని ఇంకా పౌమ్మేమీ పెట్టుకోకుండానే లోపలివాకిట్లో పారిజాతంచెట్టుకింద చాపవేసుకొని జడ అల్లుకుంటూ కూచున్నది. రాజాను చూడాగానే లేచి స్వాగతసూచకంగా చిన్నమందహాసంతో "వూరుచూడడానికి వెళ్లారు కాబోలు, చాలానేపయింది. ఏమయినా విశేషా లున్నాయా ఇక్కడ చూడదగినవి?" అంటూ పలకరించింది.

రాజా కోటూ చెప్పులూ విప్పి వచ్చి కూచొని "అట్టేవిశేషా లేమీ లేవుకాని రెండుమూడు ఫర్లాంగుల దూరంలోనే చిన్నగుట్ట ఒకటుంది. దానిమీద కూర్చొని చుట్టూఉన్న మబ్బుల్నీ, పొలాల్నీ చూస్తూ ఉంటే బాగా సాయంకాలమైపోయిన సంగతే తెలీలేదు" అన్నాడు.

"ఎక్కడానికి బాగా వీలుగా ఉంటుందా?"

"ఫరవాలేదు. ఒకమోస్తరుగా ఉంటుంది కొంచెం కష్టంగానే. అయినా పైకిగనక వెళ్లితే...ఏదో మాలాటివాళ్లకి కాస్త మనోహరమైన దృశ్యాలు కనిపిస్తాయి."

"వంటయింది భోంచేద్దామా?"

ఆరాత్రి రాజాహృదయంలో పెద్దతుపాను రేగింది. "ఈ అమ్మాయి ఇదివరకు నేను భావస్వప్నాల్లో తిలకిస్తున్నంత చక్కంది కాదుకాని ఎందుకో నన్ను ఆకర్షించివేస్తూన్నది. ......ఏమో, గృహిణిగా ఉండడానికి ఈ చక్కదనం చాలదా ఏమిటి?...ఐనా మనిషినడకలో మంచిచక్కదనం ఉంది. మాటలు చాలా పొంకంగానూ, పొదుపుగానూ వాడుతుంది.........
...వంట మహారుచిగా చేస్తుంది. సాయంత్రం చెవులకీ, ముక్కులకీగూడా ఏమీ సొమ్ములు లేకుండా ఉంటే నిజంగా కళ్లల్లోవున్న కాంతీ, చెంపల్లోవున్న స్నిగ్ధత్వమూ బయలుబడ్డాయి. ఈ ఆడాళ్లంతా సొమ్ములూ, పూలూ, రంగుచీరలూ వదిలిపెడితేనేకాని అసలు అందమనేది వాళ్లల్లో కొంచెమయినా ఉందా, లేదా, అనే విషయం తేలదు,... పైగా రాధకు నేనంటే ఎంతో ఇష్టంలాగా ఉన్నది. కాస్త బయిటికి పోతేసరి. ఎంతో నేపయిందంటుంది. కృతజ్ఞతేమో...? కాకపోయినా కష్టాల్లోనుంచి తప్పించడానికి తీసుకువచ్చి ఇప్పుడిలా అనుకోడం...?"

సగంరాత్రయింది; రాజాకు నిద్ర రాలేదు. రాధకుగూడా బహుశా నిద్రరాకుండవచ్చు. లేచి రాధ పడుకున్న వరండావైపు వెళ్లి చూచాడు.

రాధ నిర్విచారంగా నిద్రపోతూవున్నది. ఏసుఖస్వప్నం చూస్తున్నదో ఏమో, పెదవుల్లో చిన్నమందహాసం, ముఖంలో సంతృప్తీ, చెంపల్లో వికాసమూ తొలుకాడుతూ వున్నాయి.

నిశ్శబ్దంగా రాజా తనగదిలో కెళ్లి పడుకొని ఆలోచనల్లో మునిగిపోయినాడు.

మర్నాడుసాయంత్రం రాధచేసిన క్యాబేజీ పకోడీలు ఫలహారంచేస్తూ రాజా "చూడాలని ఉంటే, ఇవ్వాళ నువుగూడా రా, రాధా! నిన్నటికొండ చూచివద్దాము. చిన్నదేవాలయంకూడా ఒకటుంది అక్కడ, నీకు దేవుడు కావాలనంటే" అన్నాడు.

ఇద్దరూ కాఫీ ముగించి బయలుదేరారు. ఆఎగుడు దిగుడు కొండరాళ్లను, రాధకూడా అనాయాసంగానూ, ఉత్సాహంగానూ పమిట బిగించి ఎక్కుతూఉంటే రాజాకళ్లు కొత్తఆశల్తో నిండిపోతున్నాయి. రేగిపోతూ ఉన్న ఆమెజుట్టూ, జారిపోతూన్న ఆమెపూలూ, అలిసిపోతూవున్న ఆమెముఖమూ రాజాభావాలను తేలగొడుతూవున్నాయి. ఆమెతో ఎక్కలేక అడుగడుక్కీ తనే వెనకబడిపోతూవచ్చాడు.

ఇక పైకి పోలేక ఇద్దరూ పడమటివైపున ఉన్న ఒకసమప్రదేశాన కూర్చున్నారు. అక్కడనుంచి చూస్తే చాలా దూరందాకా పరుచుకొనివున్న వరిమళ్లు పచ్చిసుగళ్లలాగా కానిపిస్తున్నాయి. అక్కడక్కడ కాపువాళ్లు స్త్రీపురుష భేదం లేకుండా కలిసి పాటలు పాడుకుంటూ పనిచేసుకుంటున్నారు. ఉండడానికి కొంచెం దూరంలోనే వున్నా పంటచెరువు చూడ్డానికి కొండకిందనే ఉన్నట్లుండి నిర్మలంగా ఉండడంచేత రంగురంగుల పశ్చిమాకాశాన్నీ, అస్తమించబోతున్న రక్తసూర్యుణ్నీ ప్రతిఫలింపచేస్తున్నది. ఆ నిండుచేలల్లో గాలిపిల్లలు హృద్యంగా ఈలపాటలు పాడుతున్నాయి.

ఆయాసంచేత కొంచెం తీవ్రంగావస్తూన్న నిశ్వాసాలతో రాధ "చాలా హాయిగావున్నదండీ ఇక్కడ. మీరు చెప్పినమాటల్నిబట్టి ఏదో భావకవులకేగాని నాలాటివాళ్లకేమీ బాగుండదేమో ననుకున్నాను. కాని తీరా వచ్చి ఈ దృశ్యాల్ని చూస్తుంటే చెప్పలేనంత తృప్తీ, హాయీ కలుగుతూ ఉన్నాయి" అని సంభాషణ ప్రారంభించింది.

"నేనూ ఆలాగే అనుకున్నానుసుమండీ మొదట్లో. ఆ తెల్లనిమేఘాలన్నీ కరుళ్లుకట్టి పాలసముద్రం ఇదేనా అనిపిస్తున్నాయి" అన్నాడు రాజా, రాధలో కూడా కొద్దిగా కళాపిపాస ఉన్నందుకు సంతృప్తి జెందుతూ.

"ఐతే రాధా, మరి మీవూరువెళ్లడం ఎప్పుడూ?"

"వెళ్లాలి మరి త్వరగానే, డబ్బుకూడా అయిపోతున్నది."

"వెళ్లితే మరి మీవాళ్లు ఏమీ అనకుండా ఊరుకుంటారా?

"ఆవిషయం తలుచుకోడానికే భయానకంగా ఉంది. కోప్పడుతారని నాకు పెద్దభయంగా లేదుగాని మళ్లీ ఆబండతనికే ఇచ్చేప్రయత్నం చేస్తారని దిగులుగా ఉంది"

పాపం రాధకళ్లు మళ్లీ మొదటిరోజున లాగే దిగులుతో నిండిపోయాయి. రాజాహృదయం నీరయిపోయింది. తను రాధను వివాహం చేసుకుంటే ఇక చిక్కేమీ ఉండదుకాని తన మహదాశయా లన్నీనో? ...రాధ కురూపి కాదు, తెలివితక్కువదీ కాదు. పైగా తనమనసును ఎక్కువగా గుంజుకుంటూఉన్నది కూడానూ...ఇంతకూ రాధ త న్నా ఉద్దేశంతో చూస్తున్నదో లేదో...? ఆమె ఏ ఐ. సి. యస్. ఆఫీసర్ని చేసుకుందా మనుకుంటున్నదో!" రాధ ఇతనిహృదయ పరివర్తనాన్ని ఎంతవరకు కనిపెట్టుకున్నదో ఏమోగాని ముఖంలోమాత్రం ఏవిౘా కల్లోలం కనిపించడము లేదు.

చివరకు రాజా ధైర్యం చేసి గొంతు సవరించుకొని చెప్పడానికి ఉపక్రమించాడు. "పోనీ రాధా! నీ కిష్టమైతే...మీవాళ్లతో చెప్పి...నేనే...మరిమన వివాహం...నీ కిష్ట మేనా...?"

రాధ ఆకస్మికంగా 'షాకు' తగిలినట్టయిపోతుందనుకున్నాడు రాజా. కాని రాధ సామాన్యమైనముఖంతోనే కొంచెం నిరాశాకంఠంతో, "ఏంలాభం, మీకుమాత్రం వెయ్యా, రెండువేలూ కట్నం మావాళ్లెక్కడనుంచి తీసుకురాగలరు...?" అంది.

రాజా ఉద్వేగంతో "కట్న మెవరి క్కావాలి, పిల్ల నాకు అన్నివిధాలా నచ్చాలి. నాకళోపాసనకు తోడ్పడాలి అనిగానీ,...అసలు నీకు నేను తగినవాణ్ణేనో, కాదో...చూసుకో..."అన్నాడు.

కళవళపాటేమీ లేకుండానే రాధ స్థిరస్వరంతో "ఇప్పటికైనా మీకు నేను అర్హురాలినని తోస్తే...?"

క్షణం ఆలస్యం చెయ్యకుండా రాజా ఆమెను తనవొళ్లోకి తీసుకున్నాడు. విజయగర్వంతో రాధ వణికిపోయింది. గుండెలు ఆగిపోతాయేమోనన్నంత తీవ్రంగా కొట్టుకున్నాయి. కళ్లు ఉద్రేకబాష్పాలతో నిండిపోయినాయి. రెండుచేతుల్తో రాజాతలను తనహృదయంలో చేర్చుకొని కంఠాన్ని పెనేసుకుపోయింది.

విజయధ్వజంలాగా పంచమిచంద్రరేఖ బయటకి వచ్చింది.

తేలికబడ్డహృదయాలతో ఇద్దరూ కిందికి దిగి వచ్చారు.

ఆమర్నాడుసాయంత్రం హైద్రాబాదుస్టేషనులో, రాజా రాధతోగూడ దిగేటప్పటికి, ఎందుకొచ్చారో తెలీదుకాని వాళ్లవాళ్లంతా కనిపించారు. తనతండ్రీ తమ్ముడూ ఇంకోపెద్దమనిషీ...తెలుసు తన మేనమామే...మరోయువకుడూ...అవును మేనమామ కొడుకే...మరికొందరూ తమపెట్టెదగ్గరకే వచ్చారు. తనకోసమేనేమో...?

ఆశ్చర్యంతో చూస్తుండగానే ఆమేనమామ దగ్గరకు వచ్చి, కొడుకుచేతులోని 'చెంగేరి' అందుకొని, రెండుపూలహారాలు తీసి ఇద్దరిమెళ్లో చెరొకటీ వేసి, రాజాను గట్టిగా కౌవలించుకొని, "మారాజా! ఇప్పటికి దారికి వచ్చావా ?" అని, రాధను దగ్గరకు తీసుకొని ఇప్పటికి నీపట్టు నెగ్గించుకున్నవా తల్లీ"అని బుజ్జగించి, "సరీగా ముహూర్తాని కందుకున్నారు" అన్నాడు.

రాజా విభ్రమంలో పడిపోయినాడు, "ఏమిటిది? తన మేనమామకూతురేనా, ఈరాధ? ఈరాధనేనా, చిన్నప్పటినుంచీ ఎంతమంది చెప్పినా చేసుకోనని కూచున్నది!! రాధ చేసినపన్నాగమంతా అందరికీ తెలిసిందేనా!! రాధ ఎంత మేధావి!! నిజంగా ఈ రాధే తనచేతినుంచి జారిపోయినట్టయితే, తనంత నిర్భాగ్యుడు ఇంకోడుండడు!! విధాతకు కృతజ్ఞుణ్ణి"

రెండోనాటి సాయంత్రం రాజా వాకిట్లో ఈజీచైర్లో కూచొని అఖిలాంధ్రకథక సమ్మేళనానికి పంపడానికి అఘటనాసంఘటితమైన తన వివాహాన్నే కథగా రాస్తున్నాడు.